సాక్షి సిద్దిపేట

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



ఆయకట్టుకు అందని నీరు

సింగూరు సాగునీటి కాలువ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. చివరి ఆయకట్టు వరకు నీరు అందడంలేదు. వివరాలు 8లో ▸



అక్రమ కట్టడం కూల్చివేతతో..

అక్రమ కట్టడాన్ని కూల్చివేయడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు 8లో ▸



కేసీఆర్ పాలనలో..

సీఎం కేసీఆర్ పాలన స్వర్ణ యుగాన్ని తలపిస్తోందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం సీట్లు భర్తీ

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక స్వామి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తిగా భర్తీ అయ్యాయని కళాశాల సెక్రటరీ సుఖేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో సుఖేష్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక ల్యాబ్, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కళాశాల కొనసాగుతోందన్నారు. కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులు కష్టపడి చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ మెంబర్ రాజేశ్వర్, కళాశాల కోశాధికారి ప్రద్యుమ్న, సహకోశాధికారి సూర్యకుమార్, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వర్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యం

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



స్వామి వారి సన్నిధిలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): సబ్బండ వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి శివారులోని బండ మల్లన్న దేవాలయంలో ఆదివారం ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం జీవం పోస్తూ ఉపాధి కల్పిస్తోందన్నారు. అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ ప్రతి సంక్షేమ పథకాన్ని గడప గడపకు చేరవేస్తోందన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ శ్రీహరి, వీరారెడ్డిపల్లి, జంగపల్లి సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, కంచం యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

రేపు సీఎం క్రికెట్ ట్రోఫీ ఫైనల్

సిద్దిపేట జోన్: జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఆదివారం రాత్రి సీఎం క్రికెట్ ట్రోఫీ సెమీస్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. మొదటి సెమీస్‌లో మిట్టపల్లి వారియర్స్, డ్రీమ్ లెవెన్ చిన్నకోడూరు మధ్య పోటీసాగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన చిన్నకోడూర్ జట్టు 70 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన మిట్టపల్లి వారియర్స్ 74 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో సెమీస్‌లో అంబేడ్కర్ ఆజాద్, నర్సాపూర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అంబేడ్కర్ జట్టు గెలుపొందింది. సెమీస్‌లో గెలిచిన అంబేడ్కర్ ఆజాద్, మిట్టపల్లి వారియర్స్ మధ్య ఈనెల 10న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున్ పేర్కొన్నారు.

● ఆరోగ్య 'యోగ'ం



మహిళా ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా సిద్దిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కొంతకాలంగా ఉచితంగా యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రోజు ఉదయం 5.30 గంటల నుంచి 6.30 వరకు మహిళలు శిక్షణ పొందుతున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండటం విశేషం. -సిద్దిపేటజోన్

● మమ్మేలు.. మల్లన్నా

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. అభిషేకాలు, పట్నాలు, ప్రత్యేక పూజలు చేశారు. గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.

గర్భగుడి ద్వారాలకు సెన్సార్ సిస్టమ్

స్వామి ఆలయంలోని గర్భగుడి, అర్ధమండపంలోని ద్వారాలకు సెన్సార్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో బాలాజీ మాట్లాడుతూ ఈసెన్సార్ సిస్టంతో ఆలయ ద్వారాలు మూసిన తర్వాత దొంగలు తెరిచే ప్రయత్నం చేస్తే వెంటనే పోలీసు అధికారులు, ఆలయ అధికారుల మొబైల్ ఫోన్లకు సమాచారం అందుతుందన్నారు. దీనికోసం రూ 85వేలు వెచ్చించినట్లు తెలిపారు.





గంగిరేణి చెట్టు ప్రాంగణంలో భక్తుల సందడి, (ఇన్‌సెట్లో) ఆలయంలో ద్వారానికి అమర్చిన సెన్సార్ పరికరం

రైతుకు మద్దతు..



మార్కెట్‌లో ఆరబోసిన వరి ధాన్యం (ఫైల్)

- పంటల ధరలను పెంచిన కేంద్రప్రభుత్వం
- వానాకాలం పంటల నుంచే అమల్లోకి
- అత్యధికంగా నువ్వులు, పెసర్లకు..
- వరి ధాన్యానికి రూ.143 పెంపు
- అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు

దుబ్బాకటౌన్: అన్నదాతల ఆశలకు జీవం పోస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 14 రకాల పంటలకు మద్దతు ధరలు పెంచింది. ఈ వానాకాలం పంటల నుంచే పెంచిన ధరలు అమల్లోకి వస్తాయి. అత్యధికంగా నువ్వులకు రూ.805, పెసర్లకు రూ.803 పెంచింది. వరి క్వింటాలుకు రూ.143 పెంచింది. గతంలో క్వింటాలుకు రూ.50–100 వంతునే పెంపు కనిపించేది. ప్రస్తుతం రూ.143–800కు పైగా పెంచడం రైతులకు కాస్త సంతోషకరమే. 2023–24 సంవత్సరానికి గాను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే పంటలకు ఈ మద్దతు ధర కల్పించనుంది.

అత్యధికంగా వరి రైతులే..

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 5.80లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా ఇందులో 3.78 లక్షల ఎకరాల్లో వరి సాగు కావడం విశేషం. ఆతరువాత పత్తి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగు అయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో రైతులకు దళారుల బెడద తప్పింది. ఈ వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. పెరిగిన మద్దతు ధరలు అమల్లోకి తెస్తూ ఈ వానాకాలంలో క్వింటాలుకు ఏగ్రేడు ధాన్యం రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది.

పప్పు ధాన్యాల సాగు పెంచేందుకు..

క్రమంగా పడిపోతున్న పప్పు దినుసులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుంది. గతంలో పప్పు దినుసుల సంవత్సరంగా ప్రకటించిన కేంద్రం ఈసారి చిరుధాన్యాల ధరలపై ప్రధానంగా దృష్టి సారించింది. గతంలో కందులు, పెసర్లు, మినుములు, నువ్వులు, వేరుశనగలు, శనగలు, ఆవాల పంటలకు తక్కువ ధర పలికేది. వరిసాగు పెరగగా చిరుధాన్యాల సాగు చాలా తగ్గింది. పప్పులు సాగు చేయడం, మార్కెటింగ్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉండడంతో రైతుకు మద్దతు ధర దక్కిన దాఖలాలు తక్కువే. పంట అయిపోయాక వ్యాపారులే లాభపడడం ఏటా జరుగుతోంది. ఇప్పుడు మద్దతే ధరలు పెరగడంతో ఎంతో మేలు జరగనుంది.

పెంచిన మద్దతు ధరలు ఇలా...

పంట	పెంపు	ధరలు (రూ.) (2023-24)
వరి ధాన్యం మేలురకం	143	2,203
వరి ధాన్యం (కామన్)	143	2,183
మొక్కజొన్న	128	2,090
సోయాబీన్	300	4,600
పత్తి (మధ్యరకం)	540	6,620
పత్తి(పొడవు రకం)	640	7,020
జొన్నలు	210	3,180
నువ్వులు	805	8,635
పొద్దుతిరుగుడు	360	6,760
కందులు	400	7,000
పెసర	803	8,558
మినుము	350	6,950
వేరుశనగ	527	6,377
సజ్జలు	150	2,500
రాగులు	268	3,846

రైతులకు ఎంతో మేలు



కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు ఈ వానాకాలం పంటల నుంచే వర్తిస్తాయి. పత్తికి సైతం రూ.640 పెరిగింది. ముఖ్యంగా పప్పు దినుసులు, నువ్వులు, పొద్దు తిరుగుడు, వేరుశనగలకు మద్దతు ధర అధికంగా పెరిగింది. రైతులు వరికి బదులు ప్రత్యామ్నా య పంటలు పండించి లాభ పడాలి.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

వరికి మద్దతు సరిపోదు



వరి ధాన్యానికి కేవలం రూ.143 పెంచారు. వడ్లకు రూ.2,500 పైగా ఉంటేనే రైతుకు మేలు జరుగుతుంది. వరి పండించేందుకు పుట్టెడు పెట్టుబడులు అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మద్దతు ధరతో రైతుకు పెద్దగా మిగిలేది ఏం ఉండదు. వరి పండించేందుకు అయ్యే ఖర్చు, పెట్టుబడిని చూసి మద్దతు ధర పెంచితే బాగుండేది.

–రేపాక భూపతిరెడ్డి, రైతు దుబ్బాక

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

- ప్రతిపక్షాలను నిద్రలేకుండా చేస్తున్నాయి
- మంత్రి హరీశ్‌రావు
- మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజల ఆలోచన, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. పథకాలు ప్రతిపక్ష పార్టీలకు నిద్రలేకుండా చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పనితీరులకు ఆకర్శితులై కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరడం సంతోషదాయకమన్నారు. కార్యకర్తల ఆపద సమయాల్లో బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మంత్రి భరోసా నిచ్చారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో యూత్ అధ్యక్షుడు అనిల్‌తో పాటు భాస్కర్, గణేశ్, నగేశ్, బాలకుమార్, రాములు, నర్సింహులు, మహేశ్, మల్లేశ్ తదిర నాయకులు ఉన్నారు.

నేడు పలు భవనాల ప్రారంభోత్సవం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఎల్లుపల్లి శివారులో నిర్మించిన మహిళా ప్రాంగణం, వృద్ధాశ్రమం, మహిళా శిశు వికాస కేంద్రం భవనాలను సోమవారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. మహిళలకు శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా తీర్చిదిద్దేందుకు రూ.4.5 కోట్ల నిధులతో మహిళా సమైక్య భవనం, మహిళా ప్రాంగణం ఏర్పాటు చేశారు. మహిళా సమైఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యలకు శిక్షణ, ఉపాధి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎకరం స్థలంలో రూ.కోటి నిధులతో ప్రభుత్వ మోడల్ వృద్ధాశ్రమంను నిర్మించారు. 100 మంది ఉండే విధంగా ఏర్పాటు చేశారు. అనాథలుగా ఉన అభాగ్యులకు ఎంతో కొంత సేవ చేసే విధంగా వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.



మహిళా శిశు వికాస కేంద్రం

కుల వివక్ష తగదు

ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: భూమి పూజ చేసిన నాటి నుంచి ఆలయ నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఉన్న వ్యక్తి పేరును తొలగించడం సరికాదని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం దళిత ఐక్యవేదిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు చైతన్యపురి కాలనీలోని హనుమాన్ దేవాలయం నిర్మాణానికి తొలి ఇటుక అందించిన బత్తుల చంద్రం అనే దళితుని పేరును ఆలయ బోర్డు నుంచి తొలగించడం సరికాదన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న సిద్దిపేటలో కులవివక్ష తగదన్నారు. ఈ విషయంపై సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. త్వరగా విచారణ జరిపి తమకు న్యాయం జరిపించాలని కోరారు. సమావేశంలో మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్, దళిత ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, జగన్, చంద్రం, మహేందర్, మధు, లక్ష్మణ్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం



రంగనాయక సాగర్‌లో చేప పిల్లలు వదులుతున్న జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. ఆదివారం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్‌లో 5 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని జలాశయాల్లో 57 లక్షల చేపపిల్లలు వదలడం లక్ష్యమన్నారు. 336 సంఘాలు ఉండగా 24,500 మంది సభ్యులు ఉన్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులు జలకళను సంతరించుకున్నయని, మత్స్య కారులకు ఉపాధి కోసం ప్రతి ఏటా ఉచితంగా చెరువుల్లో చేప పిల్లలను వదులుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంద్లాపూర్, మైలారం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

డివిజన్ సాకారం అయ్యేనా?

ఏడేళ్ల పోరాటం ఫలించేనా

- దీక్షలతో సర్కారు దిగి వచ్చేనా?
- ఎన్నికల ముందు ప్రకటనపై కోటి ఆశలు

చేర్యాల(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల వేళ రెవెన్యూ డివిజన్ కల సాకారం అవుతుందన్న ఆశలు రేకెత్తుతున్నాయి. వివిధ పార్టీల నాయకుల ప్రకటనలు ఇందుకు ఊతమిస్తున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం సిద్దిపేటలో కలిసిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల ప్రజలు డివిజన్ స్థాయి కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదలైంది. సాధన కోసం ఏడేళ్లుగా పోరాటం కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో పోరాటం ఫలించి డివిజన్ కల సాకారమవుతుందున్న చర్చ జోరుగా సాగుతోంది. కొద్ది రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతుండటంతో డివిజన్ సాధన ఉద్యమం మరింత తీవ్రమైంది. నిరాహార దీక్షలు, సడక్ బంద్ చేపట్టడంతో ఉద్యమం ఊపందుకుంది. ఫలితంగా మొన్నటి వరకు దూరంగా ఉన్న అధికార బీఆర్‌ఎస్ నాయకులు సైతం మద్దతు పలుకుతున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి దీక్షకు సంఘీభావం తెలిపి దీక్షలో కూర్చున్నారు. మెదక్ పర్యటన సందర్భంగా రామాయంపేటను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన సీఎం కేసీఆర్ పటాన్‌చెరు, ఏటూరునాగారం, కాటారం రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ చేర్యాల డివిజన్ ప్రకటన మాత్రం మరిచారు.



మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి (ఫైల్)

ఏడేళ్లుగా..

చేర్యాల, మద్దూరు మండలాలు(అప్పటి ఉమ్మడి మండలాల) జనగామ నియోజకవర్గం నుంచి విడిపోయి సిద్దిపేట జిల్లాలో కలిసిన విషయం తెలిసిందే. జిల్లా ఏర్పాటు నుంచే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలన్న పోరాటం ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు ఏడేళ్లుగా పోరాటం చేస్తూ ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించినా ఫలితం లేదు. దీంతో అన్ని రాజకీయ పార్టీలు(బీఆర్‌ఎస్ కాకుండా) జేఏసీగా ఏర్పడి పోరాటం చేస్తున్నారు. 28 రోజులుగా స్థానిక పాత బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. దీంతో పాటు సడక్ బంద్ చేసిన జేఏసీ ఈ నెల 11న నాలుగు మండలాల బంద్‌కు పిలుపునిచ్చింది.

ప్రత్యేక ప్రణాళికతో..

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనే ధ్యేయంగా జేఏసీ ఉద్యమ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోంది. నాలుగు మండలాల్లో ఊరూరా తిరుగుతూ ప్రజలకు డివిజన్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం



రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమం ఆగదు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్టమండలాలు కలుపుతూ చేర్యాల రెవెన్యూ ఏర్పాటు చేయాల్సిందే. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే జేఏసీ కమిటీలను వేశాం. దీక్షలు కొనసాగుతున్నాయి. సడక్ బంద్ చేశాం. 11న నాలుగు మండలాల బంద్‌కు పిలుపునిచ్చాం. ముందుముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ఉద్యమం ఉధృతం చేస్తాం. – రామగళ్ల పరమేశ్వర్, జేఏసీ చైర్మన్

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి



ప్రజల ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నాలుగు మండలాల ప్రజలు డివిజన్ స్థాయి కార్యాలయాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఒక్కటే మార్గం. ప్రభుత్వం స్పందించి వెంటనే డివిజన్ ఏర్పాటుపై ప్రకటన చేయాలి.

–బొమ్మగోని అంజయ్యగౌడ్, మండల కన్వీనర్

డివిజన్ బాధ్యత నాదే

- సీఎం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చేర్యాల డివిజన్ బాధ్యత నేను తీసుకుంటానని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాల మండలంలోని 18 గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులతో చిన్నకిష్టాపూర్‌లో సమావేశమయ్యారు. ముందుగా ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకుల అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పలు డిమాండ్లను పల్లా ఎదుట పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రజల చిరకాల కల అయిన రెవెన్యూ డివిజన్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తానని వివరించారు. చేర్యాలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చే బాధ్యత నాదేనని తెలిపారు. ఏ సమస్య వచ్చినా క్షణాల్లో మీ ముందు ఉంటానని, అభివృద్ధిలో జనగామ రూపురేఖలే మారుస్తానని చెప్పారు. మీరంతా సహకరించాలని కోరారు. జనగామా టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో పల్లా ఇప్పటినుంచే ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే.. సమావేశం అనంతరం గజ్వేల్‌లో ఉంటున్న దూళిమిట్టా సర్పంచ్ ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. అసంతృప్తి నేతలను పల్లా బుజ్జగించే పనుల్లో ఉన్నట్లు సమచారం. ముత్తిరెడ్డి వర్గీయులు కొంతమంది సమావేశానికి హాజరు కాలేదని తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

గుంతలో పడి బాలుడి మృతి


దీక్షిత్ మృతదేహం

రామాయంపేట (మెదక్): పంచాయతీ భవన నిర్మాణానికి పిల్లర్ల కోసం తవ్విన గుంత మృత్యుకుహరంగా మారింది. మండలంలోని ఆర్ వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి సమీపంలో నివాసం ఉంటున్న నరేష్ కుమారుడు దీక్షిత్(6) ఆదివారం ఆడుకుంటూ వెళ్లి గుంతలో పడినట్టు స్థానికుల సమాచారం. ఎస్ఐ రంజిత్ గ్రామాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పైకప్పు కూలి మహిళకు గాయాలు


లక్ష్మిని బయటకు తీస్తున్న స్థానికులు

శివ్వంపేట(నర్సాపూర్): శిథిలావస్థకు చేరిన పెంకుటింటి పైకప్పు కూలిన ఘటనలో ఒక మహిళ గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి అల్లిపూర్ గ్రామానికి చెందిన తలారి లక్ష్మి శిథిలావస్థలో ఉన్న పెంకుటింట్లో నివాసం ఉంటోంది. భర్త చనిపోవడంతో 15 ఏళ్లుగా ఆమె ఒంటరిగా జీవిస్తోంది. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో పైకప్పు కూలింది. స్థానికులు గుర్తించి శిథిలాల కింద చిక్కుకున్న లక్ష్మిని రక్షించి చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కూలిన ఇంటిని ఆర్ఐ కిషన్ పరిశీలించారు.

సెల్ ఫోన్ అప్పగింత

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను 'సీఈఐఆర్' టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గంద్ర సృజన్ తన మొబైల్‌ను గత నెల 14న పోగొట్టుకున్నాడని, ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశాడని చెప్పారు. ఫోన్ దొరికిన వ్యక్తి సెల్ ఫోన్‌లో సిమ్ కార్డు వేయగానే ఆ వెబ్‌సైట్ ద్వారా స్థానిక పోలీసులకు వివరాలు చేరాయి. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తిని ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఇద్దరికి గాయాలు
- భయంతో పరుగులు పెట్టిన ప్రజలు


దాడిచేస్తున్న పిచ్చికుక్క

మెదక్ మున్సిపాలిటీ: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఒక పిచ్చికుక్క ఆదివారం స్వైర విహారం చేసింది. ప్రజలను వెంటపడి కరించింది. దానిని భయపెట్టడానికి ప్రయత్నించిన వారిని కూడా కరవడంతో ప్రజలంతా భయంతో పరుగులు పెట్టారు. తర్వాత పోలీస్‌స్టేషన్ దారిన వెళ్తున్న ఇద్దరిని కరించింది. అలాగే 23వ వార్డు ఫతేనగర్ వీధిలోని వాకిలి ఊడ్చుతుండగా గృహిణి దర్మకాయ్ గంగుబాయిపై కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని పలుమార్లు ఫిర్యాదులు చేసినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భయభ్రాంతులను చేస్తున్న కుక్కలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


గాయపడ్డ వృద్ధుడు


గృహిణి గంగుబాయి

ఆయకట్టుకు అందని నీరు

- సింగూరు కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు
- గండ్లు పడి వృథాగా పోతున్న ధైన్యం


ముద్దాయిపేట వద్ద పిచ్చిమొక్కలతో నిండిన సింగూరు కాలువ

పుల్‌కల్(అందోల్): సింగూరు సాగునీటి కాలువ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దశాబ్దాలుగా వాటిని తొలగించిన పాపాన పోలేదు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. వర్షాలు కురిసినప్పుడు కాలువలో నీటి ఒత్తిడి పెరిగి కాలువకు గండ్లు పడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం సింగూరు ప్రాజెక్టుకు అప్పటి డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ కాలువ మంజూరు చేసి 60 కిలోమీటర్ల మేర పంట కాలువల నిర్మాణం చేపట్టారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కొన్ని కాలువల నిర్మాణాన్ని పూర్తిచేసి సాగు నీటిని విడుదల చేశారు. పిల్ల కాలువల నిర్మాణం పూర్తి కాకుండానే నీటిని విడుదల చేయడం వల్ల సాగునీరు నేరుగా పోలాల్లోకి పారడంలేదు. దీంతో రైతులు విద్యుత్ మోటార్ల సాయంతో పంటకు నీరు పెట్టుకుంటున్నారు. వరద కాలువలు పూర్తిచేసి దశాబ్దం కావడంతో పంట కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వాటి వల్ల నీటి ప్రవాహం తగ్గి శివారు పొలాలకు నీరు అందడం లేదు. అలాగే పంట కాలువలకు సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో ఈ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురవయడంతో ఇసోజీపేట సమీపంలో సింగూరు పంట కాలువకు గండి పడి నీరంతా వృథాగా పోయింది. గండి ద్వారా నీరు ఇసోజీపేట చెరువులోకి చేరడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. చెరువు అలుగు వద్ద జేసీబీతో మట్టి తీసి నీటిని మంజీరా నదిలోకి మళ్లించాల్సి వచ్చింది. కాలువలో పిచ్చి మొక్కల వల్ల వెండికోల్, బొమ్మారెడ్డి గూడెం, అందోల్ మండలంలోని పలు గ్రామాల పంటపొలాలకు సాగునీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సింగూరు సాగునీటి కాలువలో పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.


ఇసోజీపేట వద్ద పడిన గండి (ఫైల్ ఫోటో)

జాతీయస్థాయి 'ఇన్‌స్పైర్'కు మెదక్ విద్యార్థిని


మంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న నందిని (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో జడ్పీహెచ్ఎస్ నాగ్సాన్‌పల్లి విద్యార్థిని నందిని పాల్గొననున్నట్లు డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగనున్నట్లు తెలిపారు. గత జనవరిలో నిర్మల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో నందిని ప్రదర్శించిన 'అడ్జస్టబుల్ గ్యాస్ స్టవ్ ప్లాట్ ఫారం' ప్రాజెక్ట్ జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కాగా రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రశంసాపత్రం అందజేసినట్టు తెలిపారు. అదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు గుర్తింపు తేవాలని కలెక్టర్ రాజర్షిషా ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


33 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు

33 ఏళ్ల తర్వాత కలుసుకున్న టెన్త్ బ్యాచ్

దుబ్బాకటౌన్: 1990–91లో స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో పదోతరగతి చదివిన విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా 33 ఏళ్ల కిందట టెన్త్ బ్యాచ్‌కు చెందిన 120 మంది మిత్రులు కలుసుకుని తమ యోగక్షేమాలు పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తోటి మిత్రులకు చేయూత అందించాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో గోనె మధు, జగ్గారి శ్రీనివాస్, పాతూరి శ్రీనివాస్‌రెడ్డి, పర్స రవిందర్, ఆస ముత్యం, స్వామి, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో ఘరానా మోసం

సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు, దళితబంధు పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఘరానా మోసం జరిగిందని, నిరుపేదలకు సక్రమంగా అందడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం ఆరోపించారు. ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ అరకొర నిధులతో, బంధుల పేరిట ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇటీవల అందజేసిన బీసీ బంధు పథకంలో ఘరానా మోసం జరిగిందని, నిజమైన నిరుపేదలకు ఇవ్వకుండా ఆర్థికంగా బలంగా ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలకు అందజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు ఎంపికలు కూడా అదేవిధంగా జరిగాయని, జిల్లా కలెక్టర్ వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని మల్లేశం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు నర్సమ్మ, బస్వరాజు, కడారి నాగరాజు, సంతోష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు

హవేళిఘణాపూర్(మెదక్): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు మెదక్– కామారెడ్డి జిల్లా సరిహద్దు పోచమ్మరాళ్ వద్ద ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాదారులు సహకరించాలని ఎస్ఐ కోరారు.

నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు నల్లపోచమ్మదేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ మాణిక్యరెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

హుస్నాబాద్ ఎంపీడీఓ బదిలీ

- ముగిసిన నేతలు, అధికారుల వివాదం
- కోహెడ సూపరింటెండెంట్‌కు బాధ్యతలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల ప్రజాప్రతినిధులకు, ఎంపీడీఓకు మధ్య చిచ్చుపెట్టిన గృహలక్ష్మి దరఖాస్తుల వివాదం ఎంపీడీఓ కుమారస్వామి బదిలీతో ముగిసింది. మండల పరిషత్‌లో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య జరిగిన వివాదంతో ఎంపీడీఓ సెలవులో వెళ్లారు. ఈ వివాదంపై 'నువ్వా నేనా...?' అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించి హుస్నాబాద్ ఎంపీడీఓ కుమారస్వామిని సిద్దిపేట రూరల్ మండలానికి, అక్కడి ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డిని హుస్నాబాద్‌కు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. హుస్నాబాద్‌కు బదిలీ అయిన రాఘవేంద్రరెడ్డి కోహెడ మండలం సూపరింటెండెంట్ అయితే సిద్దిపేట రూరల్ మండలానికి ఇంచార్జి ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు. హుస్నాబాద్ సూపరింటెండెంట్‌ను అక్కన్నపేటకు డిప్యూటేషన్‌పై పంపించిన అధికారులు మరో మండలం సూపరింటెండెంట్‌కు ఎంపీడీఓగా ఇంచార్జి ఇవ్వడం విశేషం. హుస్నాబాద్ ఎంపీడీఓ బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంటుంది.

మల్లన్న ఆలయ నిర్మాణానికి కృషి


శివకుమార్‌గౌడ్‌ని సన్మానిస్తున్న యాదవ సంఘం నేతలు

హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణం పూర్తి చేయడానికి హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ముందుకొచ్చారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని యాదవ సంఘం నాయకులు ఆదివారం ఆయనను కోరారు. అందుకు స్పందించి ఆలయ నిర్మాణానికి తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి, యాదవ సంఘం నాయకులు బిక్షపతియాదవ్, యాదయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 48 మంది


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): స్థానిక మోడల్ స్కూల్ గ్రౌండ్‌లో హెచ్‌డీఎఫ్ సెక్రటరీ గణపతి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17, 19 బాలబాలికల స్కూల్ గేమ్ ఫెడరేషన్ టోర్నమెంట్‌లో 48 మంది రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్ జిల్లాల నుంచి దాదాపు 200 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసినట్టు పీడీ శారద, కోచ్ కరణం గణేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. అండర్ 17, 19 బాలబాలికల కోసం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వారు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సెలక్షన్ కమిటీలో మోడల్ స్కూల్ పీడీ వెంకటేష్, స్పోర్ట్స్ స్కూల్ పీడీ వనిత, జాతీయ స్థాయి రగ్బీ రిఫరీలు శ్రీనాథ్, మల్లీశ్వరి, ఉమారాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతదేహంతో ఆందోళన

- పురిటిలోనే శిశువు మృతి
- నర్సుల నిర్లక్ష్యమే: కుటుంబ సభ్యులు


మృతి చెందిన శిశువు

దుబ్బాక: స్టాఫ్ నర్సులే డాక్టర్లుగా వ్యవహరించి ప్రసవం జరపడంతో పురిటిలోనే ఆడ శిశువు మృతికి కారణమయ్యారంటూ శిశువు కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన నవనీతకు శనివారం ప్రసవ నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను దుబ్బాక వంద పడకల ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ కాని, ఇతర వైద్యులు కాని లేకపోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు నర్సులు పురిటి నొప్పులకు ఇంజక్షన్లు వేస్తూ వచ్చారు. నొప్పులు ఎక్కువ కావడంతో రాత్రి 11 గంటలకు ఇద్దరు స్టాఫ్ నర్సులు ప్రసవం జరిపించారు. కాని కాసేపటికి బిడ్డ చనిపోయిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఎలా జరిగిందని ప్రశ్నించడంతో దానికి నర్సులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ పాప చనిపోయిందని శిశువు మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్‌ను వివరణ కోరగా శనివారం గైనకాలాజిస్టు లేకపోవడంతో డ్యూటీ డాక్టర్ నారాయణతో పాటు మరోఐదుగురు నర్సులు డ్యూటీలో ఉన్నారని, శిశువు మెడకు బొడ్డు తాడు చుట్టుకుని ఉండడంతో ఊపిరాడక మృతి చెంది ఉంటుందని చెప్పారు. శిశువు మృత దేహాన్ని శవ పరీక్షకు పంపిచామని, రిపోర్టు వచ్చాక సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అక్రమ కట్టడం కూల్చివేత.. మహిళ ఆత్మహత్యా యత్నం


జ్యోతిని అంబులెన్సులో తరలిస్తున్న సిబ్బంది

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని గ్రామస్తులు కూల్చడంతో మనస్థాపానికి గురైన ఆక్రమణ కుటుంబ సభ్యురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కెమ్మసారం యాదగిరి రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే గతంలో కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. దీనికి తోడు సుమారు 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని కూడా కబ్జా చేశాడు. కబ్జా స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని గ్రామస్తులు చెప్పినా పట్టించుకోలేదు. పంచాయతీ నోటీసులు జారీ చేసినా పెడచెవిన పెట్టాడు. అయితే ఆ ఆక్రమిత భూమిని గ్రామైక్య సంఘం భవన నిర్మాణానికి కేటాయించాలని పంచాయతీ తీర్మానించింది. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.25లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. కానీ కబ్జాలో యాదగిరి కుటుంబ సభ్యులు లేవకపోవడంతో శనివారం పంచాయతీ పాలకవర్గం, గ్రామైక్య సంఘం సభ్యులు భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. దాన్ని జీర్ణించులేక ఆక్రమణదారులు రాత్రికి రాత్రే కొంత స్థలంలో అక్రమ కట్టడాన్ని చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామైక్య సంఘం సభ్యులు, గ్రామస్తులు.. రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఆగ్రహానికి గురైన గ్రామస్తులు అక్రమ కట్టడాన్ని కూల్చివేసి ప్రభుత్వ స్థలమంటూ బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో యాదగిరి భార్య జ్యోతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు బలన్మరణం

తల్లి మందలించిందని విద్యార్థిని..


అమల(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): తల్లి మందలించిందని బీ ఫారసీ విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండల పరిధిలోని రామునిపట్లలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లెం సుజాత రెండో కుమార్తె అమల (18) కొండపాక మండలం దుద్దెడలోని కళాశాలలో బీ పార్మసీ చదువుతోంది. గత 5న ఆమె హాస్పిటల్‌కు వెళుతున్నానని చెప్పి తిరిగి ఆలస్యంగా ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అమల తల్లి పనిచేసే హోటల్ వద్దకు వెళ్లి సమీపంలోని పొలం వద్ద ఉన్న పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకోవడంతో గమనించిన తల్లి ఆరా తీయగా అసలు విషయం చెప్పింది. దీంతో అమలను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె మేనమామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినకట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

'బీసీ బంధు'పెట్టిన చిచ్చు..


శంకర్ (ఫైల్‌ఫోటో)

చిన్నశంకరంపేట (మెదక్): బీసీ బంధు డబ్బుల విషయంపై ఇద్దరు సోదరుల మధ్య రేపిన చిచ్చు ఒకరి ఆత్మహత్యకు దారి తీసిన ఘటన చిన్నశంకరంపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి శంకర్(38) స్లాబ్ వరండాలోని ఉయ్యాల తాడుకు ఉరివేసుకుని శనివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వారం క్రితం సోదరుడు ముత్యాలు పేరున బీసీ బంధు సహాయం రూ.1లక్ష వచ్చింది. గ్రామ పెద్దల సూచన మేరకు అన్నదమ్ములు సమానంగా తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న శంకర్ సోదరుడు ఆ విషయంపై ముత్యాలుతో గొడవ పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శంకర్ స్లాబ్‌కు ఉన్న ఉయ్యాల తాడుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కిరోసిన్ పోసుకుని..


నర్సింలు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): మద్యం తాగడం మానేయాలని భార్య మందలించడంతో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని భర్త ఆత్మహత్యకు పాల్పండిన ఘటన మండల పరిధిలోని రాయిన్‌పల్లి గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన నర్సింలు(40) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగి వచ్చి తరుచూ ఇంట్లో గొడవలు పడుతుంటాడు. ఈ క్రమంలో మద్యం మానేయాలని భార్య పద్మ మందలించడంతో గత 3న తనపై ఇంట్లో ఉన్న కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అది గమనించిన గ్రామస్తులు వెంటనే తలుపులు పగులగొట్టి మంటలార్పి అతడిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ అమర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ముగ్గురు..

విద్యుత్ షాక్‌తో...

పటాన్‌చెరు టౌన్: వాటర్ హీటర్ వైర్‌ను విద్యుత్ బాక్స్‌కు పెడుతుండగా షాక్ తగిలి ఓ కూలీ మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా పోచారం మండలం అన్నజిగూడకు చెందిన లక్ష్మణ్(39) బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని చక్రపురి కాలనీ మాధవరావు సైట్ వద్ద గుడిసె వేసుకొని అక్కడే కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గుడిసెలో స్విచ్ బోర్డుకు వాటర్ హీటర్ వైర్లు పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో లక్ష్మణ్‌ను సైట్ నిర్వాహకుడు మాధవరావు బీరంగూడ పరిధిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడి..


పరశురాం (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్‌తాండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చవాన్ పరశురాం(32) మూడు రోజుల క్రితం తన బైక్‌పై వెళుతూ గ్రామ శివారులోని ఫారెస్ట్ సైడ్‌వాల్ ఢీకొట్టాడు. గాయపడిన అతడిని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్‌లో..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ కూలీ మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్ పరిధిలోని వినాయక్ నగర్‌కు చెందిన ఎర్రొళ్ల దత్తు(47) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల రెండో తేదీన కూలీపని ఉందని చెప్పి లక్ష్మయ్య అనే మేస్త్రీ దత్తును అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణి నగర్ కాలనీకి తీసుకొచ్చాడు. ఓ ఇంటిని కూల్చే పనిని అప్పగించాడు. ఆ పని చేస్తున్న క్రమంలో అతని తలపై రాయి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో దత్తును ఓ ప్రైవేట్ ఆస్పత్రి తీసుకెళ్లి అక్కడ నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అయితే మేస్త్రీ సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే తన తండ్రి చనిపోయాడని దత్తు కుమారుడు ఎర్రొళ్ల జశ్వంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్ఎంపీ...


షరీఫ్‌ఉద్దీన్ (ఫైల్‌ఫోటో)

అక్కన్నపేట(హుస్నాబాద్): గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి చెందిన ఘటన అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ షరీఫ్ ఉద్దీన్(56) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన 25 ఏళ్లుగా ఆర్ఎంపీగా వైద్య సేవలందిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.